
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 28 జూన్ 2024



రోడ్డు పనులు చేపట్టాలని కేంద్ర మంత్రికి వినతి

చెన్నూరు, జూన్ 27: జోడు వాగుల బ్రిడ్జి నిర్మాణంతో పాటు పెండింగ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణలు కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి గురువారం వినతిపత్రం అందించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం రోడ్డును మంజూరు చేసిందని, ఫారెస్టు అనుమతుల కోసం కేంద్రానికి నిధుల చెల్లింపులో జాప్యం చేసిందని తెలిపారు. వెంటనే బ్రిడ్జి, రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం



భీమన్న ఆలయానికి తరలివచ్చిన మహిళలు

కన్నెపల్లి, జూన్ 27: వర్షాలు కురవాలని మండల కేంద్రంలోని మహిళలు గురువారం భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు వంద మంది మహిళలు బిందెల్లో నీటిని తీసుకువచ్చి భీమన్న దేవునికి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

తాత్కాలిక గుడిసెల తొలగింపు



గుడిసెలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చెన్నూరు, జూన్ 27: బావురావుపేట గ్రామ సమీపంలోని భూముల్లో పేదలు తాత్కాలికంగా వేసుకున్న గుడిసెలను గురువారం పలువురు తొలగించారు. సీపీఎం నాయకులు గుడిసెలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కూల్చి వేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బ్రహ్మయ్య, రవి, అనిల్, సమ్మక్క, ఉమారాణి, రేణుక, రాజేశ్వరి, భూదేవి,సరిత పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వేమనపల్లి, జూన్ 27: చెన్నూరు మండలం బావురావుపేటలో పేదలు, దళితులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బావురావుపేట శివారులోని ప్రభుత్వ భూమిలో యేడాదిగా గిరిజనులు, దళితులు గుడిసెలు వేసుకుని ఉండగా కబ్జాదారులు గుడిసెలను తొలగించి వారిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట టీఎస్ఈసీ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

నస్పూర్, జూన్ 27 : నీట్ పరీక్షను ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేసింది. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ అవకతవకల కారణంగా నీట్ పరీక్ష కోల్పోయిందన్నారు. అవకతవకలకు కారణమైన నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు మోతె జయకృష్ణ, నాయకులు శ్రీకాంత్, రమేష్, కుమార్, నరేష్ పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ క్వాలిఫైయింగ్ పోటీలు



ఏసీసీ, జూన్ 27: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాస్టర్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న యూనిక్స్ సన్‌రైజ్ సీనియర్ మెన్, వుమెన్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ క్వాలిఫైయింగ్ పోటీలు గురువారం ముగిశాయి. క్వాలిఫైయింగ్ రౌండ్‌లో మెన్స్ సింగిల్స్‌లో 69 మంది పాల్గొనగా 12 మంది క్వాలిఫై అయ్యారు. వుమెన్ సింగిల్స్‌లో 23 మంది పాల్గొనగా 6గురు, మెన్ డబుల్స్‌లో 23 మంది పాల్గొనగా 6గురు మెయిన్‌డ్రాకు అర్హత సాధించారు. ఈ పోటీలను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బాబు పర్యవేక్షిస్తున్నారు. రెఫరీగా మల్లికార్జున్, మ్యాచ్ కంట్రోలర్‌గా కుమార్‌లు వ్యవహరిస్తున్నారు. అసోసియేషన్ కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసు, జాయింట్ సెక్రెటరీలు రమేష్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 27:ప్రభుత్వ పాఠశాలల్లోని ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మాదారం 3 పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. మెరుగైన సౌకర్యాలు, ఉచిత భోజనం, యూనిఫాంలు, పుస్తకాలు అందిస్తామన్నారు. విద్యాసాగర్, రవీందర్, యశోద పాల్గొన్నారు.

సర్వేలతోనే కాలయాపన

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వెనుక ఉన్న స్థలం కబ్జా విషయమై అధికారులు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారు. భూమి విషయమై అందిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన భూసర్వే అధికారుల బృందం మూడు నెలల క్రితం సర్వే చేపట్టింది. నివేదిక సమర్పించకపోగా తిరిగి గురువారం అదే అధికారుల బృందం మరోసారి సర్వే చేపట్టింది. ఈసారైనా పట్టా భూమి లేదా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందా అనే విషయం తేల్చుతారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- జిల్లా కేంద్రంలో భూ కబ్జాపై ఫిర్యాదు
- రెండు సార్లు సర్వే జరిపిన అధికారులు
- భూమి స్వభావం తేల్చడంలో నాన్చుడు ధోరణి
- వివాదాస్పద స్థలంలో యథేచ్ఛగా వెలుస్తున్న భవనాలు



సర్వే చేస్తున్న సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్, ఇతర అధికారులు

మంచిర్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వెనుక ఉన్న స్థలం విషయమై వివాదం నెలకొంది. స్థలం కబ్జాకు గురైందని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు స్థలంలో సర్వే జరపాలని హైద్రాబాద్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ కార్యాలయానికి కలెక్టర్ లేఖ రాశారు. హైద్రాబాద్ బృందం మూడు నెలల క్రితం వివాదాస్పద స్థలంలో సర్వే జరిపారు. సర్వే రిపోర్ట్‌ను రెండు రోజుల్లో కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. తాజాగా అదే బృందం గురువారం మళ్లీ సర్వే జరిపారు.

నాన్చుడుధోరణి అవలంబిస్తున్న అధికారులు

హైద్రాబాద్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి నేతృత్వంలో అధికారులు గురువారం ఆర్టీసీ డిపో వెనుక ఉన్న సర్వే నెంబర్లు 422, గర్మిళ్ల శివారులోని 92, 93 గల 13.38 ఎకరాల పై చిలుకు ప్రభుత్వ భూమిలో సర్వే జరిపారు. కొంతకాలంగా ఈ స్థలం విషయమై వివాదం నెలకొంది. అది ప్రభుత్వ భూమి కాగా, కొందరు కబ్జా చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఫిర్యాదులు అందుకున్న అధికారులు పలుమార్లు సర్వేలు జరిపినప్పటికీ నిర్ధారించకపోవడంతో వివాదం రోజురోజుకూ ముదురుతోంది.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో

మంచిర్యాల శివారు సర్వే నెంబరు 422లో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని పట్టణానికి చెందిన తులా మధుసూదన్‌రావు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. ఆర్డీవో ఇచ్చిన నివేదిక ఆధారంగా మున్సిపల్ అధికారులు నిర్మాణ అనుమతులు ఇచ్చారని, కలెక్టర్ స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అప్పటి కలెక్టర్ బదావత్ సంతోష్ హైద్రాబాద్‌లోని ల్యాండ్ సర్వే అధికారులకు లేఖ రాశారు. ఇదే విషయమై 'జిల్లా కేంద్రంలో భూకబ్జా' శీర్షికన 2023 జూలై 18న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. మార్చి 28న హైద్రాబాద్‌కు చెందిన అధికారుల బృందం రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ డిపో వరకు సర్వే నిర్వహించారు. మూడు నెలలు గడిచినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల బృందం తిరిగి రెండోసారి సర్వే జరిపినందున ఇప్పుడైనా భూ కబ్జా విషయం తేల్చుతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యథేచ్ఛగా వెలుస్తున్న భవనాలు

వివాదాస్పద స్థలంలో రోజు రోజుకూ నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి. అధికారుల బృందం సర్వే చేపట్టగా బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు జరుగుతుండటం గమనార్హం. మూడు నెలల క్రితం నిర్మాణంలో ఉన్న భవనం ప్రస్తుతం అన్ని హంగులు పూర్తి చేసుకుంది. సమీపంలో మరి కొన్ని నిర్మాణాలు చేపడుతున్నారు. అసలు భూమి స్వభావం తేలకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. హైద్రాబాద్ నుంచి వచ్చిన వారిలో జాయింట్ డైరెక్టర్‌తో పాటు సర్వేయర్ సంధ్య, తహసీల్దార్ రమేష్, ఆర్ఐ అజీజ్‌తోపాటు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా ఏడీ శ్రీనివాస్, మండల సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి

వారం రోజుల్లో నివేదిక అందజేస్తాం

సర్వే అనంతరం ల్యాండ్ సర్వే జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి మీడియాతో మాట్లాడారు. వివాదాస్పద భూమిలో సర్వే చేపట్టాలన్న జిల్లా కలెక్టర్ లేఖతో తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. సర్వే పూర్తయినందున పూర్తి స్థాయి నివేదికను వారం రోజుల్లో కలెక్టర్‌కు అందజేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్



నస్పూర్ మున్సిపల్ కార్యాలయం, లక్షెట్టిపేట ఆసుపత్రి వద్ద పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్, జూన్ 27: మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మున్సిపాలిటీ కార్యాలయం వివిధ విభాగాలతోపాటు ప్రజా పాలన సేవా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. సీసీసీలోని నర్సరీ, డంపింగ్ యార్డును కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు అధికారులు సమష్టి కృషితో పూర్తి చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా నర్సరీలో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని సూచించారు. మురుగు కాలువల పూడిక తొలగించి పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని, డ్రై డే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రోజు తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: పట్టణంలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలోకి మార్చి పాత ఆఫీసు బిల్డింగ్‌ను ఆసుపత్రి వారికి అప్పగించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వ ఆసుపత్రికి, మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఫార్మసీ గదికి మరమ్మతు చేయించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, తహసీల్దార్ రఘునాథ్‌రావు, కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ రాజ శేఖర్, వైద్యులు ఉన్నారు.

హాజీపూర్: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు, మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్ లను పరిశీలించారు. ప్రాజెక్టు పరిధిలోని నివాసాలకు అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి ఇంటెక్‌వెల్ వరకు కాలువ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా దృష్టి సారించాలన్నారు. మిషన్ భగీరథ ఈఈమధుసూదన్, మున్సిపల్‌చైర్మన్‌ఉప్పలయ్య ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన లయన్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాల అర్బన్: కలెక్టర్ కుమార్ దీపక్‌ను లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి సభ్యులు గురువారం సన్మానించారు. త్వరలో నిర్వహించబోయే డాక్టర్స్ డే, ఇతర కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. వి.మధుసుదన్‌రెడ్డి, ఆనంద్, డేగ బాబు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం : సీపీ



శిక్షణ పొందిన వారితో సీపీ

మంచిర్యాల అర్బన్, జూన్ 27: నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. భారతీయ న్యాయ సం హిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భార తీయ సాక్ష్యాధీనం-2023పై కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు, సిబ్బం దికి నెల రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిసాయి. అడిషనల్ డీసీపీ రాజు ఆధ్వర్యంలో కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నూతన చట్టాలు అమల్లోకి వస్తున్నాయని, ప్రతీఒక్క అధికారి, సిబ్బంది అవగాహన కల్గి ఉండాలన్నారు. ఇకపై కేసుల దర్యాప్తు, విధివిధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. శిక్షణ పూర్తిచేసిన అధికారులను, అవగాహన కల్పించిన ఏసీపీ మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎస్సైలు రాజేష్, సంతోష్, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్ వ్యాప్తంగా నాకాబందీ విధిస్తున్నట్లు సీపీ శ్రీనివాస్ తెలిపారు. వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేనివారిపై, రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘన, ట్రాఫిక్ నిబంధనలు పాటిం చని వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



ఢిల్లీలో ధర్నాలో పాల్గొన్న ఎంపీ

మందమర్రిటౌన్, జూన్ 27 : నీట్ పేపరు లీకేజీపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం లక్షల మంది విద్యార్థులతో చెలగాటమాడుతుందన్నారు. నెట్ పరీక్షను రద్దు చేసిన కేంద్రం, నీట్ పరీక్షను ఎందుకు రద్దు చేయడం లేదో చెప్పాలన్నారు. బీజేపీ ఎంపీల కుటుంబీకుల కోసం చేశారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాడుతుందన్నారు. మహంత్‌అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో బెల్లంపల్లి కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూరు, జూన్ 27: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, కంప్యూటర్స్, ఫిజిక్స్ ఒక్కో పోస్టులో ఖాళీ ఉన్నాయని, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. సర్టిఫికెట్ల జిరాక్స్‌లను ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలోపు కళాశాలలో సమర్పించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'ప్రైవేట్' బోధన



పాఠాలు బోధిస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయుడు

జైపూర్, జూన్ 27: కాన్కూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు వేరే చోట నివాసం ఉండడం, ఉదయం 9 గంటలకు తెరవాల్సిన పాఠశాల 11 గంటలు అయినా తెరవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లలకు పాఠాలు బోధించేందుకు తల్లిదండ్రులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి నెలకు రూ.9 వేలు ఇచ్చి అదే పాఠశాలలో విద్యాబోధన చేయిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు సంఘం జిల్లా నాయకుడిగా వ్యవహరిస్తుండగా, అతనికి నస్పూర్ పట్టణంలో ఓ ప్రైవేటు ప్లే స్కూల్ ఉంది. ఈ విషయమై ఎంఈవో రాధాకృష్ణను గురువారం వివరణ కోరగా కాన్కూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు వ్యక్తి చేత విద్యాబోధన చేయిస్తున్న విషయం తెలియదని, ఉపాధ్యాయులు సమయానికి రావాలని చెప్పినప్పటికీ మార్పు రావడం లేదని, అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

జన్నారం, జూన్ 27 :బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ కులాల ఉద్యమపోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ నర్సింహులు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు బీసీలను అభివృద్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ కుల జన గణ చేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు అమలయ్యేలా చూడాలన్నారు. చంద్రయ్య, నరసయ్య, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ వర్మ, అశోక్, శ్రీనివాస్,రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

భీమిని, జూన్ 27: వెంకటాపూర్ గ్రామపరిధి మారాయిపల్లె గ్రామంలో గురువారం అంబిలపు సుధాకర్ ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. సుధాకర్ కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంట్లో అందరూ కూలీ పనులకు వెళ్లారు. అయితే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించగా గమనించిన చుట్టుపక్కల వారు బెల్లంపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే ఇంటిలోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. డబ్బాలో దాచిన సుమారు లక్ష నగుదు, ఇంటిలోని సామగ్రి, దుస్తులు మంటల్లో కాలిపోయాయి. సుమారు 5 లక్షల పైగానే నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటన స్థలాన్ని కన్నెపల్లి ఎస్సై గంగారాం, ఆర్ఐ వెంకటేష్ పరిశీలించారు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు అధికారులను కోరాడు.



అగ్ని ప్రమాదానికి కాలుతున్న ఇల్లు, కాలిపోయిన నగదు

మున్సిపాలిటీ ఎన్నికల కోసం కార్యాచరణ ప్రణాళిక

మందమర్రిటౌన్, జూన్ 27: మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికల కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎన్నికల సాధన కమిటీ కన్వీనర్ గుడికందుల రమేష్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి కుంటు పడిందన్నారు. సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 30న పట్టణంలోని పాత బస్టాండ్ పద్మశాలి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు. అందరి సూచన లు, సలహాలు తీసుకుని ముందుకు వెళ్తా మని తెలిపారు.

గ్రామదేవతలకు పూజలు

దండేపల్లి,జూన్ 27: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో యేటా వర్షకాలంలో రైతులు, ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు, పిల్లపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. పోచమ్మతల్లి, పెద్దమ్మ,పెద్దిరాజు, పొలిమేర దేవతలతోపాటు చిన్నయ్యపెద్దయ్య స్వాములకు పంబాలి కులస్తులతో పూజలు చేశారు. అనంతరం మేకలు, కోళ్లలను బలి ఇచ్చారు.

పిల్లలకు వైద్య పరీక్షలు

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 27: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ సహకారంతో గురువారం పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన శ్రీరామ ఆసుపత్రి వైద్యులు 63 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్ జోషి, ఆనంద్ కులకర్ణి, ఆసుపత్రి వైద్యులు రాజేష్, కంపెనీ వైద్యులు నవీన్, వంశీ, ఝాన్సీ, సాయిప్రకాష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 27: బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కుమార్ దీపక్‌ను గురువారం వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రంగు వేణుకుమార్, జ్యోత్స్నచంద్రదత్, కవిత, సునీత, పద్మ, అనిత, జ్యోతి, దేవిక, మంగళ, వాసవి తదితరులు పాల్గొన్నారు.

రోజు పారిశుధ్య పనులను నిర్వహించాలి

హాజీపూర్, జూన్ 27: పారిశుధ్య పనులను రోజు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం హాజీపూర్, దొనబండ గ్రామాల్లో పారిశుధ్య పనులు, నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోజు పారిశుధ్య పనులను చేపట్టాలని, మురికి కాలువలను శుభ్రం చేయాలని, ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

మందమర్రిటౌన్, జూన్ 27: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని గురువారం ప్రైవేటు వాహనాల డ్రైవర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డ్రైవర్లు తిరుపతి, అశోక్, రవి, రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ మూడు నెలలుగా వాహనాల యజమానులు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. బిల్లులు రావడం లేదని యజమానులు చెబుతున్నారని పేర్కొన్నారు. శ్రీనివాస్, బాబు, భాస్కర్, సురేష్, రాజేష్, అఖిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మందమర్రిటౌన్, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రజా సేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్కులు అందించాలన్నారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అజుమొద్దీన్, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 27: తాండూర్ హైస్కూల్ వెనుక ఉన్న రోడ్డు నుంచి మసీదు వరకు సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు ఎండీ ఈసా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ మండలాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఎంపీటీసీ సిరంగి శంకర్, అక్రముల్లాఖాన్, ఆదంఖాన్, షజీఖాన్, రుస్తాంఖాన్, నియాజాలిఖాన్, పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు పదోన్నతి

దండేపల్లి, జూన్ 27: మ్యాదరిపేట ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తించి పదోన్నతిపై ములుగు జిల్లా గోవిందరావుపేటకు హెల్త్ సూపర్‌వైజర్‌గా వెళుతున్న శ్యామలను గురువారం ఎంపీటీసీ నవీన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఎన్‌ఎం శ్యామల 2011 నుంచి 2024 వరకు 13ఏళ్లు ప్రజలకు మంచి వైద్య సేవలు అందించారన్నారు. రమేష్, మల్లయ్య, శ్రీనివాస్, రాజన్న, సూపర్‌వైజర్ ముత్తమ్మ, ఏఎన్‌ఎంలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జన్నారం, జూన్ 27: తాళ్లపేట గ్రామానికి చెందిన కుందారపు రఘు (29) అనే యువకుడు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రఘు అనారోగ్యంతో ఈ నెల 25న ధర్మారం రోడ్డు ఈద్గా సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుం బీకులు లక్సెట్టిపేట, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైద్రా బాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు

నెన్నెల, జూన్ 27: భూతగాదాలో మన్నెగూడం గ్రామానికి చెందిన పోగుల శ్రీనివాస్, మల్లేష్‌లపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన పోగుల అమ్మక్క, హరీష్, విక్రమ్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆస్తి పంపకాల్లో అన్నదమ్ముల కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. భూములు పంచుకుందామని పిలిచి రాత్రి పూట పడుకొని ఉన్న శ్రీనివాస్, మల్లేష్‌లపై కర్రలతో దాడి చేసి గాయపరిచారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నేరాల నియంత్రణకే
పోలీసుల పల్లె నిద్ర

వేమనపల్లి, జూన్ 27: నేరాల నియంత్రణకే పోలీసులు పల్లె నిద్రలు చేస్తున్నారని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. బుధవారం రాత్రి గొర్లపల్లిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, డెబిట్‌కార్డుల నెంబర్లు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఎస్ఐ శ్యామ్ పటేల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: అసాంఘిక శక్తులకు ప్రజలు సహకరించవద్దని ఎస్సై భూమేష్ అన్నారు. తాళ్ళపేటలో పోలీసులు పల్లెనిద్ర చేశారు. గ్రామాలకు అనుమానాస్పద వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 27: కాసిపేట మండలంలోని బుగ్గగూడెంకు చెందిన గిరిజన రైతు ఏదుల మల్లేష్ ఎద్దు పిడుగుపాటుతో గురువారం మృతి చెం దింది. మేత కోసం వెళ్లిన ఎద్దుపై పిడుగు పడడంతో మృతి చెందింది. పశువైద్యాధికారి తిరుపతి పంచనామా నిర్వహించారు. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

యూటర్న్ తొలగించాలి

బెల్లంపల్లి, జూన్ 27 : కన్నాల జాతీయ రహదారి వద్ద యూటర్న్ తొలగించాలని గురువారం ఢిల్లీలో నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా అధికారులకు బెల్లంపల్లికి చెందిన న్యాయవాది మాదరి రాకేష్ వినతి పత్రం అందించారు. నేషనల్ హైవే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కన్నాల జాతీయ రహదారిపై యూటర్న్ ఏర్పాటు చేయడంతో ఎంతో మంది ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. వెంటనే యూటర్న్ తొలగించాలని, స్థానికంగా ఉండే నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, దీంతో ఢిల్లీలో ఫిర్యాదు చేసినట్లు రాకేష్ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

పెంచికలపేట, జూన్ 27:సిర్పూర్ నియోజక వర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం పీఎం శ్రీ నిధి ద్వారా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో నియోజక వర్గంలోని వివిధ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పాఠశాలలో సమస్యలపై ఆరా తీశారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకు రాగా త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, నాయకులు సత్యనారాయణ, మధుకర్, నాగన్న, మహేష్, కాంతారావు, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

జిల్లాలో బీఆర్‌ఎస్‌కు మరో ఎదురుదెబ్బ?

- ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కాంగ్రెస్ మంతనాలు

ఆసిఫాబాద్, జూన్ 27: కుమరంభీం ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగలనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటమి చెందడం తదనంతరం బీఎస్పీ పార్టీ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజీనామా చేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. తన ఓటమికి కారకుడైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకోవడంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి సిర్పూర్‌నియోజకవర్గ బాధ్యతలను అన్ని తానై చూసుకుంటున్నారు. బీఆర్ఎస్‌ని దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ దండె విఠల్‌తో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పార్టీలో చేరాలని ఇది వరకే ఎమ్మెల్సీని పలుమార్లు సంప్రదించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై దండె విఠల్‌ను ఫోన్‌లో సంప్రదించగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం అందరిని సంప్రదించిన విధంగానే తనను కూడా సంప్రదించిందని. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

● సంక్షిప్తం..

● చింతలమానేపల్లి: డబ్బా, ధరంపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తోడుతున్నారనే సమాచారం మేరకు గురువారం దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకుని విశ్వజిత్ మండల్, సోనుర్లె వినోద్, దండిక వెంకటేష్‌లపై కేసు నమోదు చేశామన్లి ఎస్సై నరేష్ తెలిపారు.

● కెరమెరి: కెరమెరిలో ప్రతి ఆదివాం నిర్వహించే వార సంతను రూ.1,87,500కు రాథోడ్ సాగర్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు.

● పెంచికలపేట: ఎల్కపల్లి రైతు వేదికలో జూలై 5వ తేదీన నిర్వహించే ఆర్టీసీ రాయితీ బస్‌పాస్ మేళాను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు.

- బొంబాయిగూడ, మోట్లగూడ గ్రామాల్లోని కిరాణ దుకాణాల్లో గురువారం సోదారుల నిర్వహించి రూ.4,500 విలువ చేసే గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.

● కౌటాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు నూతన విద్యావిధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు.

● కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార శాఖ (పీఏసీఎస్) కార్యాలయంలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు.

- కాగజ్‌నగర్ ఇందిరా మార్కెట్‌లోని ద్వారకా ప్రసాద్‌పె దుకాణంలో సోదాలు చేపట్టగా రూ. 37వేల విలువ గల తంబాకు ప్యాకెట్లు లభించినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

● కాగజ్‌నగర్: మార్కెట్ ఏరియాలో బుధవారం రాత్రి పలు గోడౌన్‌లో సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రూ.2.30లక్షల విలువ గల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

● వాంకిడి: మండల కేంద్రంలోని గోదాంలో బుధవారం రాత్రి తనిఖీ చేయగా రూ.12,573 విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నట్లు వాంకిడి ఎస్సై సాగర్ తెలిపారు.

● ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శనివారం మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా మత్స్య శాఖాధికారి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

● సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
● నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
● రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో టీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత టీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు



జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!

న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారి్‌ఫల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారి్‌ఫ్‌లను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారి్‌ఫ్‌లను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారి్‌ఫలు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారి్‌ఫలు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారి్‌ఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారి్‌ఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారి్‌ఫలనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారి్‌ఫల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్
ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

● సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
● అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
● డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
● సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ దైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరద్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ.. ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం
» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలుపడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య
» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల
» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు
» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నేళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
శుక్రవారం 28 జూన్ 2024



నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 27: రాష్ట్రంలో జూలై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై పోలీసు అధికారులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర డీజీపీ రవి గుప్తా అన్నారు. గురువారం అన్ని జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌తో పాటు డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు పాల్గొన్నారు. జూలై 1 తరువాత నమోదయ్యే కేసులను కొత్త చట్టాల ప్రకారం రిజిస్టర్ చేయాలని సూచించారు. నూతన చట్టాలపై అధికా రులకు, సిబ్బందికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడంలో సమన్వయాధికారిగా వ్యవహరించిన డీసీఆర్బీ సీఐ రమేష్, ఎస్‌బీ ఎస్సై రామకృష్ణను డీజీపీ అభినందించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 27: వర్షాకాలం నేపథ్యంలో అధికారులు మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, ఆర్‌డీవో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ సదయ్యలతో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, నీరు, విద్యుత్ వంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ రహదారుల రాక పోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. పూర్తికాని రహదారులు, వంతెనల పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో కరెంట్ నిరంతరం ఉండేలా జాగ్రత్తలు తీసుకో వాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యుత్ సౌకర్యం ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నీటి విషయంలో అప్రమత్తంగా ఉడాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

● పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలి

ఆసిఫాబాద్: జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాకేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువా రం నిర్వహించిన సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రఘు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఎల్‌డీఎం జోషి, డీటీఓ రాంచందర్‌తో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ టీజీఐపాస్ ద్వారా పొందిన అనుమతులను పరిశీలించారు. సేవారంగానికి సంబంధించిన ఐదు ఎస్సీ యూనిట్లకు రూ.17.9 6 రెండు ఎస్టీ యూనిట్లకు రూ.7.56 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

1 నుంచి 'సంపూర్ణ అభియాన్'

ఆసిఫాబాద్, జూన్ 27: దేశంలో అభివృద్ధి చెందని ప్రాంతంలో పురోగతిని అంచనా వేయడానికి నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి దేశ వ్యాప్తంగా సంపూర్ణత అభియాన్ అనే పథకాన్ని ప్రారంభించనున్నట్లు నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ బీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, డీఈవో అశోక్, ఉద్యానవన ఏడీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలపారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 ఏళ్ల పైబడిన వారికి డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణుల సంఖ్యను ముందుగానే తెలుసుకుని ప్రాథమిక దశ నుంచే వారికి పోషకాహారం, మందులు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రణాళిక అధికారి పాపయ్య, ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ మణివేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ సామగ్రి జప్తునకు ఉత్తర్వులు

కాగజ్‌నగర్, జూన్ 27: కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయ సామగ్రిని జప్తు చేయాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీపీరావు ప్రాజెక్టు భూ సేకరణ కోసం ఎకరానికి లక్ష రూపాయిల చొప్పున 132 ఎకరాలకు డబ్బులు చెల్లించాలని గతంలో కోర్టు మూడు నెలలు గడువు విధించింది. కాగా పరిహారం చెల్లించడంలో అధికారులు విఫలమయ్యారని బాధితుల తరుపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. పరిశీలించిన కోర్టు ఆర్డీవో కార్యాలయ సామగ్రిని జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

హెచ్‌సీయూ వైస్‌ఛాన్సలర్ దిష్టిబొమ్మ దహనం

కాగజ్‌నగర్, జూన్ 27: కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకే సాయికుమార్, చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్‌సెంట్రల్ యూనివర్శిటీలో సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులను వైస్ ఛాన్సలర్ జగదీశ్వర్ సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. పది మందిని సస్పెండు చేసి, ఐదుగురికి జరిమానా విధించడం సరికాదని చెప్పారు.వైస్ ఛాన్సలర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, నితిష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలకు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 27: తెలంగాణ రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌ల లోని క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం గురువారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 27 మంది పాల్గొనగా ప్రతిభ చాటిన వారిని జూలై 8న హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలకు పంపిస్తామని డీవైఎస్‌ఆర్ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, నీతి అయోగ్ బాధ్యులు రాహుల్, ఓఎస్‌డీ సుధాకర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, గిరిజన క్రీడల అధికార బండ మీనారెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు శంకర్, విద్యాసాగర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవో ఉద్యోగాలకు ఇద్దరి ఎంపిక

బెజ్జూరు, జూన్ 27: బెజ్జూరు మండలానికి చెందిన ఇద్దరు ఏవోలుగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఏవో ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మిర్యాల మనీషా, నలుగుపల్లి గ్రామానికి చెందిన పేదం ప్రేమలత ఉద్యోగాలు సాధించారు. గత ఏడాది మే 16న ఏవో ఉద్యోగాలకు పరీక్ష రాయగా ఏడాది కాలం తరువాత ఫలితాలు విడుదల చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఆసిఫాబాద్, జూన్ 27: బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌వేణుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.. కార్యక్రమంలో నాయకులు చాంద్‌పాషా, బ్రహ్మానందం, శ్రీనివాస్, పోశం, మహేష్, చందు, తిరుపతి, హరిశ్చంద్రప్రసాద్, సత్యశ్రీ, లత, సంగీత, సలీం, కవిత తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

దహెగాం, జూన్ 27: దహెగాం మండలం బ్రాహ్మణచిచ్చాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎల్కరి అంజన్న తన పట్టా భూమిలో వ్యవసాయ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎల్కరి వెంకన్న, ఎల్కరి సురేష్, ఎల్కరి బూదక్క, ఎల్కరి అమృత అనే వ్యక్తులు కలిసి కర్రతో కొట్టి దాడి చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై కేసు

దహెగాం, జూన్ 27: మండలంలోని చిన్న ఐనం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గేదెల కాపరికి నెలవారి ఇచ్చే వేతనం విషయంలో కుడుక స్వరూప అదే గ్రామానికి చెందిన హేమ సత్తన్న, భార్య పెంటక్క, కుమారుడు శ్రీకాంత్‌లకు మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. కుడుక స్వరూపను ముగ్గురు వ్యక్తులను కలిసి కొట్టినట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భూములు స్వచ్ఛందంగా వదులుకోవాలి

బెజ్జూరు, జూన్ 27: పోడు సాగు చేసుకుంటున్న రైతులు స్వచ్ఛందంగా భూములను వదులుకోవవాలని బెజ్జూరు ఎఫ్‌ఆర్వో దయాకర్ అన్నారు. గురువారం వివిధ గ్రామాలకు చెందిన పోడు రైతులతో మాట్లాడారు. పోడు భూముల్లో మొక్కలు పెట్టేందుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

పెట్టుబడి సాయానికి ఎదురుచూపులు

జిల్లాలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతు బంధు పథకానికి బదులు రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రక టించింది. విధి విధానాలను ఖరారు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయ డంతో పెట్టుబడి సాయం మరింత ఆలస్యం కానుంది.



- ఇప్పటికే ప్రారంభమైన వానాకాలం సాగు పనులు
- మరింత ఆలస్యం కానున్న 'రైతు భరోసా'
- విధివిధానాల ఖరారుకు మంత్రివర్గ ఉపసంఘం
- జూలై 15లోపు నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశాలు
- రుణమాఫీపైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

చింతలమానేపల్లి, జూన్ 27: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీల పథకాన్ని అమలు చేస్తామని కాం గ్రెస్ పార్టీ ప్రకటించింది. అందులో భాగంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని చెప్పింది. ఈ పథకం ద్వారా ఒక్కో ఎకరానికి రెండు సీజన్లకు కలిపి రూ. 15వేల చొప్పున కౌలు రైతులకు కూడా అంతే మొత్తాన్ని, రైతు కూలీలకు రూ. 12వేల చొప్పున సాయం అందజేస్తామని ప్రకటించింది. అంతకు ముందు ఇదే పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేసింది. పట్టా కలిగిన వారందరికి సీజన్‌కు రూ. 5వేల చొప్పున రెండు దఫాలు మొత్తం ఎకరాకు రూ. 10 వేల సాయం అందజేశారు. ఇందులో కౌలు రైతులకు ఎలాంటి సాయం అందించలేదు.

ధరణి పోర్టల్ ఆధారంగా..

గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అనుసంధానం చేసుకొని నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. ఈ క్రమంలో సాగులో ఉన్న, సాగులో లేని భూములు, రహదారులు, ప్రాజెక్టుల్లో సేకరించిన భూములు, నాలా మార్పిడి చేయకుండా వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, భూ స్వాములకు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండానే అప్పటి ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో గతేడాది (వానాకాలం, యాసంగి) ఐదు వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో జిల్లా లోని రైతాంగంతో పాటు 16,400 మంది పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులకు కూడా సుమా రుగా 16కోట్ల 40లక్షల చొప్పున లబ్ధి చేకూరింది. అలాగే లక్ష 42వేల596 మంది రైతులకు ప్రతీ ఏడాది సుమారుగా 219.54కోట్ల పెట్టుబడి సాయం అందింది.

ఇందులో కొందరు రైతుల ఖాతాలు రెగ్యులర్‌గా ఉండకపోవడం, సంబంధిత అధికారులకు పట్టా వివరాలు ఇవ్వకపోవడం తదితర కారణాలతో కొంత మందికి మాత్రమే సాయం అందలేదని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ పభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని సవరించి తామ ప్రకటించిన రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని భావించింది. గడిచిన యాసంగి సీజన్‌లో పాత విధానంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది.

4.6 లక్షల ఎకరాల్లో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 4.6 లక్షల ఎకరాల్లో సుమారుగా లక్ష పైలుకు రైతులు సాగుకు శ్రీకారం చట్టారు. కాగా వానాకాలం సీజ న్ ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదుర చూ స్తున్నారు. కొత్త పథకాన్ని అమలు చేస్తారా.. పాత పథకం ప్రకారమే పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ చేస్తారా.. అని రైతులు చర్చించుకుంటున్నారు. దాని కంటే ముందు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

ఈ నెల 21న నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ముందుగా రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేతృత్వంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉప సంఘాన్ని నియమించారు. ఈ ఉప సంఘం రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు, వివిధ వర్గాల నుంచి సూచనలు స్వీకరించి జూలై 15లోపు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నివేదికను వచ్చే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించి విధి విధానాలను ఖరారు చేయనున్నారు. కాగా పథకం అమలు చేసేందుకు 5 లేదా 10ఎకరాల వరకు పరిమితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

రహదారులు, కొండలు, గుట్టలు, బండరాయి భూములు, సాగుకు యోగ్యం కాని భూములు, ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములు, ప్రభుత్వ ఉద్యోగుల భూములను ఈ పథకం నుండి తొలగించే అవకాశం ఉన్నది. రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని కౌలు రైతులకు, పట్టాదారులకు తలో కొంత అందించే అవకాశం ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. విధివిధానాలను ఖరారు చేసిన తర్వాతనే ఈ సీజన్ నుంచి గానీ, వచ్చే సీజన్ నుంచి గానీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం



ఆసిఫాబాద్‌లోని పైకాజీనగర్ కాలనీలో నిలిచిన వరదనీరు



చింతలమానేపల్లిలో కురుస్తున్న వర్షం

ఆసిఫాబాద్, జూన్ 27: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో గడిచిన 24 గంటల్లో 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఆసిఫాబాద్, చింతలమానేపల్లి, సిర్పూర్(టి)లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బెజ్జూరు, వాంకిడి, కౌటాల మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో సుమారు గంట పాటు కురిసిన వర్షానికి పైకాజీనగర్ కాలనీలో వరదనీరు నిలిచిపోయింది.

చింతలమానేపల్లి: మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. దీంతో అన్నదాతలకు ఊరట లభించింది. వర్షాలకు ముందే రైతులు విత్తనాలు పెట్టుకున్నా వర్షం మెట్ట పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలో మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజు లుగా చినుకు జాడ లేక పోవడంతో పంట చేనులలో విత్తనాలు నాటిన రైతు ల్లో ఆందోళన చెందుతుండగా కురిసిన వర్షంతో ఊరి పీల్చుకున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి సరైన వర్షాలు కురవక పోవడంతో రైతులు నాటిన విత్తనాలు మొలకెత్తక పోవడంతో రైతులు రెండో సారి విత్తనాలు నాటారు.

బెజ్జూరు: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా చినుకు జాడ లేక పోవడంతో పంట చేనులలో విత్తనాలు నాటిన రైతుల్లో ఆందోళన మొదలవగా కురిసిన వర్షం పంటలకు ఊరి పోసింది.

సమస్యలు పరిష్కరించాలి

జైనూర్, జూన్27: ఐటీడీఏ పరిధిలో జీసీసీ ద్వారా కొనసాగుతున్న పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్న ఆపరేటర్లు గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాను కలిసి సమస్యలు పరిష్కరిచాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు ఆత్రం శంకర్, సిడాం మమత, సిడాం సోని, గేడాం భరత్, లింగు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పతల్లి ఆట

ఆసిపాబాద్, జూన్ 27: వర్షాలు కరువాలని గురువారం జిల్లా కేంద్రంలో అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కప్పతల్లి ఆడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యక్షుడు తిరుపతి, నరేష్, నరేందర్ రాజు, సురేష్, ప్రణయ్, రమేష్, సంతోష్, సునీల్, ఆనంద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని తరలించొద్దు

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 27: కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిని తరలించవద్దనిఎస్పీఎం మిల్లు కార్మికులు గురువారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుకు వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో ఎస్పీఎం పర్మనెంటు, కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

వినియోగదారుల హక్కులను కాపాడుతాం



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 27: వినియోగదారుల హక్కులను కాపాడుతామని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) జాయింట్ అడ్వైజర్ కేవీ సురేష్‌బాబు అన్నారు. సీసీసీలోని గెస్ట్‌హౌస్‌లో విద్యార్థులు, టెలికాం వినియోగదారులు, సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులు, వినియోగదారల ఫోరమ్‌ల ప్రతినిధులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విని యోగదారుల ప్రయోజనాలు కాపాడడం, టెలికాం రంగం వృద్ధికి ట్రాయ్ నిరంతరం కృషి చేస్తుంద న్నారు. ఏరియా జీఎం బి సంజీవరెడ్డి మాట్లాడుతూ, ట్రాయ్ సంస్థ తమ ఏరియాను ఎంపిక చేసి నందుకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ (తెలంగాణ, తమిళనాడు) ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, వినియోగ దారుల హక్కుల రక్షణకు పాటుపడుతామన్నారు. పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి, ఆవిష్కర ణలను ప్రోత్సహించడానికి, ఆర్థిక వ్యవస్థలో పెట్టు బడులను ప్రోత్స హించడానికి, విస్తరించడానికి ట్రాయ్ ఆధ్వర్యం లో 5జి టెక్నాలజీ వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు, డీజీఎ(ఐఈడీ) చిరంజీవు లు, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ ఎం వెంకటపతి, సింగరేణి పాలిటె క్నిక్ అధ్యాపకుడు మూర్తి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడేందుకు ఉద్యమించండి

శ్రీరాంపూర్, జూన్ 27: సింగరేణిని కాపాడేందుకు బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు ఉద్యమించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలోని బొగ్గు గనులు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తోందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలుపడం దారుణమన్నారు. వేలాన్ని పూర్తిగా నిలిపివేసేవరకు, బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించేవరకు దశలవారీ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ శాసనసభ్యుడు దివాకర్ రావు, నాయకుడు విజిత్ రావు, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు పెట్టెం లక్ష్మణ్, కె. సురేందర్ రెడ్డి, పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

రెబ్బెన, జూన్ 27: సింగరేణి ఏరియాలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు బెల్లంపల్లి ఏరియా సీహెచ్‌పీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి అన్నారు. గోలేటిలోని బెల్ట్‌సెఫ్టీ సిస్టంను, డస్ట్ సపరేట్ మానిరింగ్ సిస్టంను గురువారం పరిశీలించారు. పలు పెండింగ్ సమస్యలపై సీహెచ్‌పి డీజీఎం బీంరావు జాడెతో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, శేషశైనారావు, మారం శ్రీనివాస్, మంతన వేణు, రాజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కట్టర్ల కొరతను తీర్చాలి

శ్రీరాంపూర్, జూన్ 27: శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె 7 గనిలో కోల్‌కట్టర్ల కొరత ఉందని, సమస్య పరిష్కరించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీసైదా అన్నారు. గురువారం వారు గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. మ్యాన్ పవర్ తక్కువగా ఉందని మేనేజర్‌కు తెలుపగా, కావాల్సినంత మ్యాన్‌పవర్‌ను పంపించేలా ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, పిట్ కార్యదర్శి బీర రవీందర్, సహాయ కార్యదర్శి బరిగెల ప్రతాప్, నాయకులు పారపల్లి రాజేందర్, కీసర తేజ, యాదగిరి అన్వర్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 27: కాసిపేట 2 గనిలో మ్యాన్‌రైడింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గని పిట్ సెక్రటరీ కారుకూరి తిరుపతి గని మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మ్యాన్‌రైడింగ్ పనులు పూర్తి కాక పోవడంతో కార్మికులు నడవాల్సి వస్తుందని, పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు కార్యక్రమంలో నాయకులు రవికిరణ్, పరమేశ్వర్, సత్తయ్య, హరీష్, జగన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలి

మందమర్రిటౌన్, జూన్ 27: తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయిం చాలని కోరుతూ కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి ఢిల్లీలో గురువారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిలు వినతి పత్రం అందించారు. సత్తుపల్లి, కొయ్యగూడెం, మందమర్రి, శ్రావణపల్లి గనులను వేలం వేయవద్దని కోరారు. ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం ద్వారా ఉపాధి అవకాశాలు ఉండవని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సింగరేణికే కేటా యించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. వేలం పాటలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని తెలిపారు.



ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తే లక్ష్యం



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, జూన్ 27: సింగరేణిలో ప్రమాద రహిత ఉత్పత్తే యాజమాన్యం ప్రధాన లక్ష్యమని, దీనిని దృష్టిలో ఉంచుకుని గనులు, డిపార్టుమెంట్ల వారీగా హెచ్‌వోడీలు పకడ్బందీ రక్షణ చర్యలు చేపట్టాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. గురువారం సాయంత్రం జీఎం కాన్ఫరెన్స్ హాలులో ఏరియాలోని మేనేజర్, రక్షణాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అధికారులు గనిలోని పని స్థలాలను పరిశీలించాలని, రక్షణకు సంబంధించి ఏమైనా లోపాలుంటే సరి చేయాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ కార్మికులు విధులు నిర్వహించేలా కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు లేని మందమర్రి ఏరియా లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. సమావేశంలో మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్, అన్ని గనుల ఏజెంట్లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందనున్న అధికారికి సన్మానం

మందమర్రిటౌన్, జూన్ 27: మందమర్రి జీఎం కార్యాయలంలో జీఎం ఈఅండ్‌ఎం సీహెచ్‌పీ కార్పొరేట్ అధికారి నవీన్‌కుమార్‌ను గురువారం ఏరియా జీఎం మనోహర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాలుగా సింగరేణిలో విధులు నిర్వహించిన నవీన్‌కుమార్ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్నారని తెలిపారు.

కైరిగూడ ఓసీని సందర్శించిన జీఎంలు



జీఎం రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

రెబ్బెన, జూన్ 27: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓపెన్ కాస్టును జీఎం(ఇ అండ్ ఎం) (సీహెచ్‌పీఎస్) నవీన్‌కుమార్, బెల్లంపల్లి జీఎం రవి ప్రసాద్ గు రువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌పిట్ క్రషర్‌ను పరిశీలించారు. మరో మూడు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న జీఎం రవి ప్రసాద్‌ను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం మచ్చగిరి నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, పీవో ఉమాకాంత్ పాల్గొన్నారు.